క్లుప్తంగా

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ద్విచక్రవాహన వేగాన్ని ప్రత్యేక పరికరం ద్వారా పరిశీలిస్తున్న డీఎస్పీ బాబాప్రసాద్

కర్నూలు (టౌన్): కర్నూలు టౌన్ డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కేవీఆర్ కళాశాల వద్ద ద్విచక్రవాహనాల తనిఖీ నిర్వహించారు. మైనర్ల డ్రైవింగ్‌తో సైలెన్సర్ల ద్వారా పెద్దగా శబ్దం చేస్తూ వెళుతున్న వాహనాలను నిలిపి ప్రత్యేక పరికరం ద్వారా వేగాన్ని కొలిచారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. విస్మరిస్తే చర్యలు తప్పవన్నారు. నగరంలో విద్యార్థులు, యువకులు అతివేగంగా వెళుతూ ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అలాంటి వారిపై మరింత కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తామన్నా రు. ట్రాఫిక్ సీఐ మన్సురుద్దీన్, రెండవ పట్టణ సీఐ నాగరాజారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టైపిస్టుల పాత్ర కీలకం



జెడ్పీ సీఈఓను కలిసిన టైపిస్టు, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ నేతలు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ కార్యాలయాల్లో టైపిస్టులు, స్టెనోగ్రాఫర్స్ పాత్ర కీలకంగా ఉంటుందని జిల్లా పరిషత్ సీఈఓ జీ.నాసరరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ నెల 20వ తేదీన గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ టైపిస్టు అండ్ స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లాకు చెందిన బీ బ్రహ్మానందరెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలోనే బుధవారం బ్రహ్మానందరెడ్డితో పాటు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి, ఈసీ మెంబర్లు జ్యోతిప్రభ, మద్దిలేటి, సీనియర్ స్టెనో భరత్ తదితరులు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి అసోసియేషన్ కార్యవర్గ ప్రతిని అందించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ..ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నతాధికారులకు, టైపిస్టు, స్టెనోగ్రాఫర్స్‌కు అనుబంధం ఉంటుందన్నారు. ప్రతిఒక్కరూ పని పట్ల శ్రద్ధగా ఉంటూ అధికారుల మెప్పు పొందాలని సూచించారు. నాయకులు కిశోర్, శ్రీధర్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన సదస్సు

కర్నూలు(అర్బన్): కర్నూలు డివిజన్‌లోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఈ నెల 24న ఉదయం 10:30 గంటలకు స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్.రామచంద్రారెడ్డి తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పల్లెపండుగ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని పలు గ్రామాల్లో రూ.67 కోట్లతో 832 సీసీ రోడ్ల నిర్మాణాలు మంజూరయ్యాయన్నారు.ఈ నిర్మాణాలకు సంబంధించి నాణ్యత,పర్యవేక్షణ, నిర్మాణం తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు డివిజన్‌కు చెందిన ఈఈ, డీఈఈ, ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజినీర్లు హాజరుకావాలని ఎస్ఈ కోరారు.

ఆర్‌యూ బీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో బుధవారం బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 17 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. రెగ్యులర్, సప్లిమెంటరీకి సంబంధించి మొత్తం 4,318 మంది విద్యార్థులకుగాను 3,943 మంది హాజరు కాగా 375 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

దెబ్బతిన్న రహదారులను బాగు చేయండి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని 29, 37, 38 వార్డుల్లో దెబ్బతిన్న రహదారులను బాగు చేయాలని సీపీఐ బృందం డిమాండ్ చేసింది. బుధవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలోని బృందం ఆయా వార్డుల్లో పర్యటించి దెబ్బతిన్న రహదారులను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా రహదారులు దెబ్బతినడంతో ప్రజలు నడవడానికి కూడా తీవ్ర ఇబ్బందిగా ఉన్నట్లు చెప్పారు. వెంటనే రహదారులను బాగుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు డి.శ్రీనివాసరావు, మహేష్, నాగరాజు, అన్వర్, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డిజిటల్ ఆహ్వానం


- శుభకార్యాల ఆహ్వానాల్లో చోటు చేసుకుంటున్న మార్పులు
- స్మార్ట్‌గా ఇన్విటేషన్లు
- డిజిటల్ కార్డులతో పిలుపులు
- వీడియోలతో వాట్సాప్ మెసేజ్‌లు
- తగ్గిపోతున్న ప్రింటింగ్ కార్డుల సంస్కృతి

కర్నూలు కల్చరల్: ఆదోనికి చెందిన వెంకట్ కుమారుడు యూఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన తన కొడుకు వివాహానికి ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల్లోని బంధుమిత్రులకు ఆహ్వానం పంపేందుకు సన్నాహాలు చేపట్టారు. సమయం కేవలం రెండు వారాలు మాత్రమే ఉండటంతో అందరికీ పత్రికలు పంచేందుకు వీలు కాని పరిస్థితి. కుమారుడి సలహా మేరకు బెంగళూరుకు వెళ్లి క్యూర్ స్కానర్‌తో వీడియో వెడ్డింగ్ కార్డులు, ఏటీఎం తరహాలో డిజిటల్ కార్డులు డిజైన్ చేయించారు. కేవలం నిమిషాల వ్యవధిలోనే వాట్సాప్ ద్వారా బంధుమిత్రులకు ఆహ్వానం పలికేశారు. సరికొత్త ట్రెండ్‌తో అందించిన పెళ్లి పిలుపుపై ప్రతి ఒక్కరూ అభినందనలు కురిపించారు.

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో పాటు వివాహ, శుభకార్యాలకు ఆహ్వానించే విధానం వినూత్నంగా మారింది. గతంలో వివాహాది శుభకార్యాలకు బంధుమిత్రులను పిలవాలంటే కనీసం నెల రోజులు ముందుగా వెడ్డింగ్ కార్డులు ముద్రించి వ్యయ ప్రయాసలకోర్చి గడప గడపకు వెళ్లి పంచాల్సి వచ్చేది. మారుతున్న కాలంతో పాటు అది కాస్తా ఫోన్ కాల్స్, మెసేజ్‌ల రూపంలోకి వచ్చేసింది. డిజిటల్ ప్రపంచంలోకి అడుగు పెట్టిన ఆధునిక యుగంలో ఆహ్వాన పత్రికలు వీడియో వెడ్డింగ్ కార్డుల రూపంలో హల్‌చల్ చేస్తున్నాయి. మరింత ముందుకు వెళ్లి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ వెడ్డింగ్ కార్డులు వచ్చేశాయి.

ఏటీఎం తరహాలో కార్డులు

పెళ్లికి బంధుమిత్రులను పిలిచేందుకు క్యూఆర్ కోడ్‌తో ప్రింట్ చేసిన ఏటీఎం తరహా కార్డులు ప్రస్తుతం మార్కెట్‌లో విస్తృతంగా వాడుకలో ఉన్నాయి. వీడియో వెడ్డింగ్ ఇన్విటేషన్స్‌తో పాటు ఉన్నతస్థాయి బంధుమిత్రుల కోసం విజిటింగ్ కార్డ్స్ రూపంలో ఉండే డిజిటల్ వెడ్డింగ్ కార్డులు పంపుతున్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి మహా నగరాల్లో వీటి వినియోగం ఎక్కువైంది. ఏపీలో మాత్రం తొలిసారి పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ కాంట్రాక్టర్ తన కుమారుడి వివాహం కోసం ఈ తరహా కార్డులను తయారు చేయించినట్లు చెబుతున్నారు. ఇందులో కార్డు పైభాగంలో వధూవరుల పొటో, పేర్లు, ఆహ్వానించేవారి పేర్లు, తల్లిదండ్రుల పేర్లు మాత్రమే ఉంటాయి. వెనుక భాగంలో క్యూఆర్ కోడ్ ముద్రించి ఉంటుంది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే వివాహానికి సంబంధించిన పూర్తి వివరాలు కనిపిస్తాయి. పెళ్లి మండపం అడ్రస్, లొకేషన్ మ్యాప్, పెళ్లి పత్రిక, విందు టైమింగ్స్, ముహూర్త సమయంతో పాటు సంప్రదించాల్సిన వధువు, వరుడి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు ఉంటాయి.



క్యూఆర్ కోడ్‌తో తయారు చేసిన డిజిటల్ వెడ్డింగ్ కార్డులు, ఏటీఎం తరహా వెడ్డింగ్ కార్డు

ప్రస్తుతం ఇదే ట్రెండ్

డిజిటల్ యుగంలో యువత బర్త్‌డే, ఎంగేజ్‌మెంట్, గ్రాడ్యుయేషన్, బేబీ షవర్, ఆఫ్ శారీ ఫంక్షన్స్, గృహప్రవేశాలు వంటి అన్ని శుభకార్యాలకు వీడియో కార్డుల ద్వారా ఆహ్వానాలను వాట్సాప్‌లో పంపుతున్నారు. ఇంటర్నెట్, కంప్యూటర్‌పై అవగాహన ఉన్న ప్రతి వ్యక్తి ఉచిత టెంప్లెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమకు నచ్చిన డిజైన్‌లలో ఆహ్వాన పత్రికలను తయారు చేసేస్తున్నారు. కరోనా తర్వాత ఆహ్వానాలను డిజిటల్ పద్ధతిలో పంపేందుకే ప్రజలు ఇష్టపడుతున్నారు.

ప్రింటింగ్ కార్డులపై తగ్గిన మోజు

వివాహ మహోత్సవంలో ప్రధాన భూమిక పోషించే వెడ్డింగ్ కార్డులు కాలానుగుణంగా రూపు మార్చుకుంటున్నాయి. బ్లాక్ అండ్ వైట్ కార్డులతో మొదలైన పెళ్లి పత్రికలు తర్వాత కలర్, యూవీ, లేజర్, ఫొటో ప్రింటింగ్, సౌండ్ సిస్టమ్ కార్డులుగా మారాయి. ఈ ట్రెండ్ కొంత కాలం కొనసాగింది. రూ.2 నుంచి రూ.20 వరకు ఒక్కో కార్డు ప్రింటింగ్ ధర ఉండేది. ప్రస్తుతం నయా ట్రెండ్ మొదలైంది. డిజిటల్ యుగంలో వీడియో వెడ్డింగ్ కార్డులు మార్కెట్‌ను శాసించాయి. ప్రస్తుతం క్యూఆర్ కోడ్ స్కానర్‌తో రూపొందించిన డిజిటల్ కార్డుల వైపు యువత మొగ్గు చూపుతోంది. దీంతో ప్రింటింగ్ ప్రెస్ దుకాణాలు వెలవెలబోతున్నాయి.

ప్రింటింగ్ కార్డుల వాడకం తగ్గింది



గతంలో వివాహాల సీజన్‌లో పెళ్లి కార్డుల ప్రింటింగ్‌కు బాగా డిమాండ్ ఉండేది. కుటుంబ ఆర్థిక స్థితిగతులను బట్టి విభిన్నమైన, వినూత్న రీతిలో కార్డులను ఎంచుకొని ప్రింట్ చేయించుకునే వారు. బిజినెస్ బాగా ఉండేది. ప్రతి ప్రింటింగ్ ప్రెస్ నిర్విరామంగా పని చేసేది. ప్రస్తు తం ఆ పరిస్థితి లేదు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు మాత్రం అడపాదడపా తక్కువ క్వాంటిటీతో పెళ్లి పత్రికల కోసం వస్తున్నారు. నామ కరణం, కేశఖండన, బర్త్‌డే, పుట్టి దట్టి, హాకీకా, పర్సనల్ వెడ్డింగ్ కార్డ్స్ లాంటివి పూర్తిగా తగ్గిపోయాయి. కేవలం ఫ్యామిలీ కార్డ్స్ మాత్రమే ఆర్డర్స్ వస్తున్నాయి. సుమారు 50 శాతానికి పైగా బిజినెస్ తగ్గింది. కంప్యూటర్ కాలం, డిజిటల్ హవా, ఆండ్రాయిడ్ ఫోన్లు రావడంతో ఆహ్వాన పత్రికలకు డిమాండ్ తగ్గింది.

– ఎం.కె.శ్రీనివాసులు, కిరణ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, కర్నూలు

సేవా కార్యక్రమాలు అభినందనీయం



వృద్ధాశ్రమంలో భోజనం వడ్డిస్తున్న ఎస్వీ విజయమనోహరి

కర్నూలు కల్చరల్: ప్రముఖ సినీ హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు వైఎస్సార్‌సీపీ నాయకులు వన్నె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మద్దూరు నగర్‌లోని అమ్మ అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కేడీసీసీబీ మాజీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి ముఖ్య అతిథిగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మంచి నటనతో దేశంలో కోట్లాది మంది అభిమానులను ప్రభాస్ సొంతం చేసుకున్నారన్నారు. ఆయన పుట్టిన రోజున అభిమానులు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రభాస్ అభిమానులు పాల్గొన్నారు.

ఓపెన్‌హౌస్ పరిశీలన

కర్నూలు (టౌన్): స్థానిక ఏపీ ఎస్పీ రెండవ పటాలం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్‌ను బుధవారం కోడుమూరు ఎమ్మెల్యే బి.దస్తగిరి పరిశీలించారు. పోలీసు అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని అక్కడ ఏర్పాటు చేసిన వరద సహాయ పరికరాలు, బోటు, ప్రమాద సమయంలో ప్రజలను ఆదుకోవడం తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. అలాగే నారాయణ, సాయుధ పోలీసు విద్యానికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్, ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించారు. 14వ కమాండెంట్ ప్రభుకుమార్, ఇన్‌చార్జ్ అదనపు కమాండెంట్ మహబూబ్‌బాషా, పటాలపు అసిస్టెంట్ కమాండెంట్స్ షర్ఫుద్దీన్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

'అగ్నివీర్' ఎంపిక ప్రక్రియపై సదస్సులు



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు పోస్టుల ఎంపిక ప్రక్రియ గురించి బుధవారం స్థానిక బి.క్యాంపులోని సిల్వర్‌జూబ్లీ కళాశాల, కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ (సెట్కూరు)–జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులకు సికింద్రాబాద్ నుంచి ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ కార్పొరల్ ఆఫీసర్స్ సందీప్, సూరీందర్ సింగ్ హాజరై ప్రసంగించారు. ఇంటర్ విద్యార్హతతో 17.5 నుంచి 21 సంవత్సరాల లోపు వయసున్న వారిని, నాలుగేళ్ల కాలపరిమితితో ఈ ఉద్యోగంలో తీసుకుంటారని తెలిపారు. ముందుగా ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి దేహదారుఢ్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఎంపిక చేస్తారని చెప్పారు. నాలుగేళ్ల సర్వీసు తర్వాత వారిలో 25 శాతం మందిని పూర్తి కాలపు సర్వీసులో తీసుకుంటారని, మిగతా 75 శాతం మందికి డిగ్రీ సర్టిఫికెట్‌తో పాటు రూ.11.50 లక్షలు చెల్లిస్తారన్నారు. అలాగే ప్రభుత్వ శాఖలలో ఉద్యోగాలకు రిజర్వేషన్ ఉంటుందని చెప్పారు. సెట్కూరు సీఈవో దీప్తి, ప్రిన్సిపాళ్లు వీవీఎస్.కుమార్, నాగస్వామి నాయక్, జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి సోమశివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి నాణ్యతను బట్టి ధర ఇవ్వాలి



ఉల్లి రైతులతో మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో జరుగుతున్న ఉల్లి క్రయవిక్రయాలను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తనిఖీ చేశారు. ఈ–నామ్ సెంట్రల్ సర్వర్‌లో సాంకేతిక సమస్య ఏర్పడిన నేపథ్యంలో బుధవారం మార్కెట్‌కు వెళ్లి ఉల్లి కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయని పరిశీలించారు. పలువురు రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఏ గ్రామం.. ఎన్ని ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు.. పెట్టుబడి ఎంత పెట్టారు.. దిగుబడి ఎంత వచ్చింది.. మార్కెట్‌లో ఏ ధరకు అమ్ముకున్నారు.. కాటాలు సక్రమంగా ఉన్నాయా తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి మాట్లాడుతూ.. మార్కెట్‌కు ఉల్లి భారీగా వస్తోందని, ఈ–నామ్ సర్వర్‌లో సాంకేతిక సమస్య వల్ల మాన్యువల్‌గా క్రయవిక్రయాలు జరుగుతున్నందున జాప్యం జరుగుతోందని ఎంపీకి వివరించారు. ఎంపీ మాట్లాడుతూ.. ఉల్లి నాణ్యతను బట్టి ధరలు కోట్ చేయాలని వ్యాపారులకు సూచించారు. రైతులు నష్టపోకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ అధికారులకు సూచించారు. సెక్రటరీ జయలక్ష్మితో పాటు అసిస్టెంటు సెక్రటరీలు వెంకటేశ్వర్లు, రహిమాన్, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జిమ్నాస్టిక్స్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): గుంటూరు పట్టణంలోని బీ.ఆర్.స్టేడియంలో ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లాల జిమ్నాస్టిక్స్ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్– 10 బాలుర ఆర్టిస్టిక్ విభాగంలో కనిష్క (మూడవ స్థానం), బాలికల ఆర్టిస్టిక్ విభాగంలో సుప్రితశ్రీ (తృతీయస్థానం), బాలికల రిథమిక్ విభాగంలో మేధ (ద్వితీయ స్థానం), నిధిశ్రీ (తృతీయ స్థానం), అండర్–12 బాలికల రిథమిక్ విభాగంలో వినీల (తృతీయ స్థానం)లో నిలిచి పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అభినందించారు. జిమ్నాస్టిక్స్ శిక్షకులు టీ.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎవరి భూములు ఆక్రమించుకోలేదు

కర్నూలు(సెంట్రల్): తాను ఎవరి భూములు ఆక్రమించుకోలేదని, వారసత్వంగా తండ్రి నుంచి సంక్రమించిన భూమినే స్వాధీన పరచుకున్నానని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం కల్లూరు మండలం నెరవాడకు చెందిన బి.వరలక్ష్మీ అనే మహిళ తన కుటుంబసభ్యులతో కలసి ఎక్సైజ్ కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి తన భూమిని ఆక్రమించుకున్నారని కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో బుధవారం మధుసూదన్‌రెడ్డి స్పందించారు. తనపై చేసిన ఆరోపణలు పచ్చి అబద్ధమన్నారు. రెవెన్యూ రికార్డుల పరంగా తమకు రావాల్సిన 262/4 సర్వే నంబర్‌లోని 44 సెంట్లు, 253/4లోని 9 సెంట్లను జిల్లా సర్వేయర్‌తో సర్వే చేయించి అధికారులు పకడ్బందీగా అడంగల్, ఆర్ఓఆర్‌లలో పొందుపరచినట్లు చెప్పారు. తనకు వారసత్వంగా వచ్చిన భూమిని అద్దదారుల్లో వరుసకు చిన్నమ్మ అయిన వరలక్ష్మీ ఆక్రమించుకోవాలని చూస్తోందని, ఆమె కొందరి చెప్పుడు మాటలు విని మోసపోతోందన్నారు. ఆరోపణలపై ఎలాంటి విచారణ జరిపినా సహకరిస్తానని పేర్కొన్నారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం

కర్నూలు(సెంట్రల్):విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, నగర నిర్మాణ బాధ్యులు పి.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ నగర మహాసభలు జరిగాయి. ముందుగా ఏఐఎస్ఎఫ్ జెండాను ఆ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ ఎన్నిక

సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అభి, ఉపాధ్యక్షులుగా మహేంద్ర, సాబీర్, జశ్వంత్, బాలాజీ, కార్యదర్శిగా అశోక్, సహాయ కార్యదర్శులు గా అంజి, మహేంద్ర, మధు, బ్రహ్మానందరెడ్డి, కోశాధికారిగా వీరేష్ తోపాటు 19 మందిని కార్యవర్గ సభ్యులుగా, 21 మందిని సమితి సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా సోమన్న షాబీర్‌బాషా, రాష్ట్ర సమితి సభ్యురాలు శివాని, జిల్లా ఉపాధ్యక్షుడు శరత్‌కుమార్ పాల్గొన్నారు.

డ్వామా పీడీ శివప్రసాద్ ఇక రానట్లే !

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులైన జి.శివప్రసాద్ ఇక్కడ పదవీ బాధ్యతలు స్వీకరించే అవకాశం లేనట్లే. పంచాయతీరాజ్ శాఖలో డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) అయిన ఈయన పల్నాడు జిల్లా నీటియాజమాన్య సంస్థ ఏపీఓ (ఎం అండ్ ఈ)గా విధులు నిర్వహించారు. ఈయన్ను జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం గత నెలలో జీఓ ఆర్‌టీ నంబరు 535 జారీ చేసింది. ఇక్కడ పదవీ బాధ్యతలు చేపట్టేందుకు అక్కడ రిలీవ్ కూడా అయ్యారు. అయితే కారణాలు ఏమిటో కానీ ఇంతవరకు ఇక్కడికి రాలేదు. ఇక వచ్చే అవకాశం లేదని అధికార వర్గాలు తెలిపాయి. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి నాసరరెడ్డి పూర్తి అదనపు బాధ్యతలతో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన జెడ్పీ బాధ్యతలతోనే ఒత్తిడికి గురవుతున్నారు. ఇక డ్వామా పీడీ పోస్టు కూడా కీలకమైనదే. ఒకే అధికారిపై రెండు కీలకమైన బాధ్యతలు ఉండటం వల్ల డ్వామాపై పూర్తి స్థాయిలో దృష్టి సారించలేని పరిస్థితి ఏర్పడింది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఖబరస్తాన్



ఆమ్ (బటౌ) ఖబరస్తాన్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు పాతబస్తీ జమ్మిచెట్టు సమీపంలో ఉన్న ఆమ్ (బటౌ) ఖబరస్తాన్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కర్నూలులో ఈ ఖబరస్తాన్ అతిపెద్ద, ప్రసిద్ధ సమాధి స్థలాలలో ఒకటి. ఇక్కడ అనేకమంది చారిత్రాత్మక పేరున్న పెద్దలను సమాధి చేసి అంతిమ సంస్కారాలు చేశారు. నేటికీ ప్రతిరోజూ అనేకమంది ఇక్కడికి వచ్చి చనిపోయిన వారికి నివాళులు అర్పిస్తుంటారు. ప్రస్తుతం ఈ పవిత్ర స్థలం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పాతబస్తీకి చెందిన యువత, మధ్య వయస్కులు ఇక్కడ మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను సేవిస్తున్నారు. రాత్రిపూట వ్యభిచారాలు కూడా జరుగుతున్నట్లు సమీప ప్రజలు చర్చించుకుంటున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఎవరైనా ప్రశ్నిస్తే వారిని తీవ్ర పదజాలంతో దూషిస్తున్నారు.

కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు

ఖబరస్తాన్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై ఆలిండియా ముస్లిం మైనార్టీ కౌన్సిల్ కర్నూలు శాఖ స్పందించి కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసింది. అక్కడ పోలీసు పెట్రోలింగ్‌ను పెంచాలని, సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరింది.

ఆస్పిరేషనల్ బ్లాక్ లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా/హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): ఆస్పిరేషనల్ బ్లాకులైన హొళగుంద, మద్దికెర, చిప్పగిరి మండలాల్లో నిర్దేశించిన 40 సూచికలను వంద శాతం అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఆస్పిరేషనల్ బ్లాకుల పురోగతిపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యశాఖకు సంబంధించి గర్భిణుల నమోదు, ఆసుపత్రుల్లో ప్రసవాలు, బరువు తక్కువగా పుట్టిన పిల్లల శాతం, మధుమేహ పరీక్షలు, హైపర్‌టెన్షన్ పరీక్షలు తదితర అంశాలను నూరు శాతం చేపట్టాలని సూచించారు. ఐసీడీఎస్‌కు సంబంధించి తీవ్రమైన పోషకాహారలోపం, మితమైన పోషకాహార లోపం ఉన్న ఐదేళ్లలోపు పిల్లల సంఖ్యను తగ్గించడానికి కృషి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్‌కు సంబంధించి జల్‌జీవన్ మిషన్ కింద పెండింగ్‌లో ఉన్న ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వడం, ఓడీఎఫ్ ప్లస్ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. ఆస్పిరేషనల్ బ్లాకుల్లో హౌసింగ్ పురోగతి తక్కువగా ఉందని, త్వరితిగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. ఈ మూడు మండలాల్లో నూటికి నూరు శాతం ఫైబర్ నెట్ కనెక్షన్లను ఇవ్వాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, సీపీఓ హిమప్రభాకరరాజు, డీఎంహెచ్ఓ భాస్కర్, ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మి, హౌసింగ్ పీడీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

పాము కాటుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహమ్మద్ ఇద్రిస్

కర్నూలు కల్చరల్: కర్నూలు నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం పాము కాటుపై అవగాహన కార్యక్రమం జరిగింది. సంఘమిత్ర యానిమల్ ఫౌండేషన్ సభ్యులు మహమ్మద్ ఇద్రిస్ అవగాహన కల్పించారు. పాము కనపడగానే అక్కడి నుంచి దూరంగా వెళ్లిపోవాలన్నారు. రాత్రి పూట తప్పక టార్చ్ లైట్‌ను వాడాలన్నారు. నేలపై నిదురించే వారు దోమ తెరలను వాడాలని సూచించారు. రాష్ట్రంలో కేవలం నాలుగు జాతుల పాములు మాత్రమే విషపూరితమైనవని మిగతా వాటికి విషం ఉండదని వివరించారు. పాము కాటుకు గురైతే ఆలస్యం చేయకుండా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. విద్యాలయం ప్రిన్సిపాల్ పాయల్ ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు చదువులో ముందుండాలి

కర్నూలు (టౌన్): మహిళలు చదువులో ముందుండాలని సీఐ విజయలక్ష్మీ సూచించారు. స్థానిక ఆత్మకూరు రోడ్డులోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం 'మీ కోసం పోలీసు శాఖ' పేరుతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన తాను ఇప్పుడు పోలీసు శాఖలో సీఐగా ఉన్నానన్నారు. ప్రతి మహిళ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, తద్వారా అన్ని రంగాల్లో ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎస్ఐ ప్రేమ, కళాశాల కరెస్పాండెంట్ రాజమ్మ, విజయసూరి పాల్గొన్నారు.

27న 'మరీ అంతొద్దు' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో 27వ తేదీ సాయంత్రం 7 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో'మరీ అంతొద్దు' సాంఘి క నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. గుంటూరు ఆరాధన ఆర్ట్స్ వారిచే ప్రదర్శించే ఈ నాటికను భాస్కర చంద్ర రచించారని, నడింపల్లి వెంకటేశ్వరరావు దర్శకత్వం వహించినట్లు చెప్పారు.

కేసీ కాల్వలో మురుగు కలవకుండా చర్యలు



కేసీ కెనాల్‌ను పరిశీలిస్తున్న నగరపాలక, ఇరిగేషన్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరంలోని కేసీ కెనాల్‌లో మురుగు నీరు కలుస్తుండడం, కలుషితం వంటి సమస్యలు ఉత్పన్నమవడంతో సమస్య పరిష్కారానికి బుధవారం నగరపాలక, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే చేపట్టారు. చాలాకాలంగా ఈ సమస్య ఉండటంతో పర్యావరణ పరంగా ఇబ్బందులు వస్తున్నాయి. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. కేసీ కెనాల్‌లో మురుగు నీరు కలవకుండా తీసుకోవాల్సిన చర్యలు, డ్రైనేజీ మళ్లింపు పనులపై చర్చించారు. నగరపాలక ఈఈ సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.